తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సంపుటి : 2 | సంచిక : 280 | బుధవారం | 05 - 03 - 2025 | పేజీలు : 8 | వెల : 5.00 | www.telanganamuchatlu.in

### రాష్ట్ర ప్రభుత్వానికి
## సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు :**



పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఇప్పటి వరకు కోర్టు నుంచి తమకు నోటీసులు రాలేదని ప్రతివాదుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ప్రతివాదుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి సహా ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. 22వ తేదీలోపు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయి మాట్లాడుతూ.. రీజనబుల్ టైమ్ అంటే గడువు ముగిసే దాకా..? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విధానాలు ఏం కావాలి..? ఎంత సమయం కావాలో చెప్పండి. ఆపరేషన్ సక్సెస్ , పేషంట్ డెడ్ అనే తీరు సరికాదు అని మండిపడ్డారు. బీఆర్ఎస్ తరపున సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం వాదించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆ తర్వాత హైకోర్టులో విచారణ జరిగింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన జడ్జిమెంట్‌ను డివిజన్ బెంచ్ రివర్స్ చేసింది. ఇప్పటికి ఏడాది పూర్తయింది. కావాలని ఆలస్యం చేస్తున్నారు అని సుందరం పేర్కొన్నారు.



## కారు కదిలేది ఎన్నడూ?

**కేసీఆర్ గత ఎన్నికల్లో ఓటమిని ఊహించలేదు.**

**సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని బలంగా నమ్మారు**

**ప్రజలు నమ్మేందుకు అవకాశం లేదు..?**

**ఎన్నికలప్పుడు తప్పించి ఆయన జనంలోకి రాలేదు..!**


**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వైఖరిలో ఇప్పటికైనా మార్పు రాక పోతే పార్టీ మరొకసారి అధికారం లోకి రావడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆయన ఫాం హౌస్‌కు మాత్రమే పరిమితమవుతూ క్యాడర్ ను నిరాశలోనే ఉంచుతున్నారు. సాధారణ ఎన్నికలు జరిగి ఏడాదిక పైగానే అవుతున్నప్పటికీ ఇంకా ప్రజా సమస్యలపై పోరాటానికి సన్నద్ధం కాకపోవడంతో ఆయనలో మార్పు ఇక వస్తుందని ఇటు క్యాడర్, అటు ప్రజలు నమ్మేందుకు అవకాశం లేదు. ఏడాది నుంచి అప్పుడప్పుడు ఎన్నికలప్పుడు తప్పించి ఆయన జనంలోకి రాలేదు. గతంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన తప్పిదాలే పార్టీకి శాపంగా పరిణమించాయని చెబుతున్నారు. నేతలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నా ఆయన మాత్రం జనంలోకి రావడానికి ఇష్టపడటం లేదు. కేసీఆర్ గత ఎన్నికల్లో ఓటమిని ఊహించలేదు. తాను అమలు చేసిన సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని బలంగా నమ్మారు.

రాష్ట్ర ఖజానాకు భారంగా పరిణమించినా అనేక పథకాలను ఆయన తీసుకు వచ్చి ప్రజల మనసు ను గెలుచుకోవచ్చని భావిం చారు. కానీ జనం ఆయనను నమ్మేలేదు. కేవలం సంక్షేమ పథకాలను చూసి మాత్రమే ఓట్లు వేయరన్న విషయం ఎన్నికల అనంతరం తెలిసి వచ్చింది.

ఆయన వ్యవహార శైలి ఓటమికి ప్రధాన కారణం. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా బయటకు రాకపోవడంతో పాటు వారిని కలిసేందుకు ఇష్టపడక పోవడంతో జనం తమ ఓటుతో తీర్పు చెప్పారు..అయినా నేటికీ ఆయనలో మార్పు రాలేదు. జనంలో ఉండి వారి సమస్యలను వింటేనే దగ్గరవుతారు.

ఏడాది వర కూ వెయిట్ చేశారంటే ఓకే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటుతున్నా ఫాం హౌస్ గడప దాటకపోవడంపై సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. అదిగో వస్తా రు.. ఇదిగో వస్తారంటూ గులాబీ పార్టీకి చెందిన పత్రికల్లో కథనాలు రావడం మినహా ఆయన మాత్రం బయటకు తొంగి చూడటం లేదు. దీంతో పాటు అధికారంలో ఉన్నప్పు డు పెత్తనం చేసిన కుటుంబ సభ్యులే ఇప్పుడు కూడా పార్టీలో కీలకంగా మారడం కూడా కొన్ని సామాజిక వర్గాల వారికి మింగుడు పడటం లేదు. ఇప్పటికైనా కేసీఆర్ తన వైఖరిని మార్చుకుని పార్టీలో కొంత మార్పులు తెచ్చి, తాను మారితే తప్ప గెలుపు గురించి ఆలోచించ కూడదని ఆ పార్టీ నేతలు డిసైడ్ అయినట్లే కనపడుతుంది.?



### కొత్త రేషన్ కార్డుల జారీకి
## ముహూర్తం ఖరారు..


**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న తెలంగాణ వాసులకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఉగాది నాటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. ఆ క్రమంలో కొత్త రేషన్ కార్డు నమూనాను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఫైనల్ చేశారు. లేత నీలి రంగులో ఈ కొత్త రేషన్ కార్డును తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే రేషన్ కార్డుపై సీఎం రేవంత్ రెడ్డితోపాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉండే విధంగా రేషన్ కార్డు నమూనాని ఖారారు చేశారు. ఇక రేషన్ కార్డుపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే రేషన్ కార్డులు ఉన్న వారికి కూడా కొత్త కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 80 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వారందరికీ కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ ప్రభుత్వం ఆదేశించారు. ఇంకోవైపు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ ఇప్పటికే ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొనేందుకు మీ సేవలను క్యూ కట్టారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకానికి రేషన్ కార్డు తప్పని సరి కావడంతో.. వీటి కోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య పెరుగుతోంది. అదీకాక ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. ఆ సర్వేలో సైతం కుటుంబ సభ్యుల ఆదాయం, ఇతర వనరులకు సంబంధించి కీలక సమాచారాన్ని నమోదు చేసింది. దీంతో రాష్ట్రంలోని ప్రజల ఆదాయంపై ప్రభుత్వానికి ఓ నిర్దిష్టమైన సమాచారం ఉంది. దాంతో దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే రేషన్ కార్డు అందించేలా రేవంత్ సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మార్చి 30వ తేదీ తెలుగు సంవత్సరాది.. ఉగాది. ఆ రోజున కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి తన స్వహస్తాలతో శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఉండాలనే ఓ స్పష్టమైన లక్ష్యంతో రేవంత్ సర్కార్ వడివడిగా అడుగులు వేస్తోంది.

## విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కుట్ర

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

ప్రతీ అంశంలో ప్లేటు ఫిరాయిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల అమ్మకంపై కూడా తన నాలుకను మడత పెట్టి నిస్సిగ్గుగా నిధుల సమీకరణ కోసం వేలాల బాట పట్టిండు అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. భూముల వేలంపై మారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని చూసి ఊసరవెల్లి సైతం ఉరి వేసుకునే పరిస్థితి నెలకొన్నది అని విమర్శించారు. 'ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి అని, తెలంగాణ జాతి సంపద అని, ఆ భూములను అమ్మితే భవిష్యత్తులో స్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని" నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కార్చిండు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి ఇపుడు వేల కోట్ల విలువైన భూములను అగ్రాస్ వేసేందుకు తెరలేపిండు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అమ్మబోమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి మూడు నెలలైనా గడవక ముందే విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారు. పవిత్ర అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలను నీటి మూటలు చేస్తూ, నిధుల సమీకరణ పేరుతో ఇప్పుడు నిస్సిగ్గుగా భూములను అడ్డికి పావుశేరుకు అమ్ముతుండటం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతున్నది. మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియమకానికి (ఆర్ఎఫ్‌పీ) గత నెల 28న టెండర్లు పిలవడం దిగజారుడు తనానికి పరాకాష్ట అని హరీశ్‌రావు మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే



నంబర్ 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టిన సమయంలో ప్రభుత్వం 25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10వేల కోట్లు ఇప్పటికే సమీకరించింది. ఇప్పుడు ఇదే భూమిని వేలం వేసి దాదాపు రూ.30వేల కోట్లను సమీకరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఒకవైపు బ్యాంకులో తనఖా పెట్టడం, మరోవైపు తనఖా పెట్టిన అవే భూములను వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనం. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కపట బుద్ధిని ఆధారాలతో సహా బయటపెట్టాను అని హరీశ్‌రావు గుర్తు చేశారు. జూన్ 26, 2024 నాడు విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి 75 కోట్ల చొప్పున మొత్తం 30వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్న భూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు. నిండు సభలో ముఖ్యమంత్రి సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారని హరీశ్‌రావు అన్నారు.



## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**9 లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.**

**ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను**

**పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తాం**

**కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు**

**విద్యార్థుల కోసం హెల్ప్ లైన్ నెంబర్**

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసింది. మొదటి సంవత్సరం పరీక్షలు.. రేపటి నుంచి అంటే.. మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. వీరి కోసం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,532 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

**విద్యార్థుల కోసం బోర్డు కీలక నిర్ణయాలు..**

ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లొకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు. పరీక్షకు ఒక రోజు ముందు కేంద్రాన్ని పరిశీలిస్తే అన్ని విధాలా మంచిది. ప్రశ్నపత్రంపై సీరియల్

# తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ ఎన్నిక



**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు**

హ్మకొండ తెలుగు బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ఇందులో జనరల్ కౌన్సిల్ మెంబర్ గుగ్గిళ్ళ సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అద్యక్షుడు: రెవ. యన్. మత్తయి ఉపాధ్యక్షుడు: యన్. టెక్నా, ప్రధాన కార్యదర్శి:ఎ. మోజెస్ సహాయ కార్యదర్శి: జి. జాన్ కోశాధికారి : కె. విజయ్ కుమార్ సహాయ కోశాధికారి: పి. గాబ్రియేలుకార్యవర్గ సభ్యులుగా... జె. ప్రసాద్ పాల్, టి. కుమార్ బి. కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# తెలుగు బాప్టిస్ట్ కౌన్సిలర్ ఎన్నిక



**జనగామ తెలంగాణ ముచ్చట్లు,**

జనగామ తెలుగు బాప్టిస్టు జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా నల్ల ఆమోస్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ అద్యక్షులు రెవ. యన్. సత్యపాల్, ఉపాధ్యక్షులు: నక్క డేవిడ్, ప్రధానకార్యదర్శి : వి. మోజిస్, సహాయ కార్యదర్శి కె. మోజెన్, కోశాధికారి: పి. సుధాకర్, సహాయ కోశాది కారి: పి. ప్రభాకర్ కార్యవర్గసభ్యులుగా : జీవరత్నం, బి. బాషా, ఎన్నుకున్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**హసన్‌పర్తి,తెలంగాణ ముచ్చట్లు**

వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు పుట్టిన రోజు సందర్భంగా హసన్ పర్తి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ, మండల అభివృద్ధికి నిరంతరాయం కృషి చేస్తున్నారని ఇలాగే ఆయురారోగ్యాలతో ముందు ముందు రాజకీయంగా ఎదగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అద్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహ రెడ్డి.మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి.మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి.జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ కుమార్,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మేటిపల్లి మదన్ గౌడ్,వీసం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారుఆనందం ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని అన్నారు.

## చిన్నారి కావ్య శ్రీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న
# మార్కెట్ యాడ్ వైస్ చైర్మన్,మాజీ ఎంపీపీ



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం మోజార్ల గ్రామానికి చెందిన తిరుపతయ్య,రాణి దంపతుల కుమార్తె కావ్య శ్రీ మొదటి పుట్టినరోజు వేడుకలను మంగళవారం కొత్తకోట ఆర్కే గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పెద్దమందడి మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ జన్మదిన వేడుకల్లో పాల్గొని చిన్నారి కావ్య శ్రీ ని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదిగట్ల మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య గౌడ్,మహిళా సమైక్య సిబ్బంది, గ్రామస్తులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించండి



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

సర్పంచుల సంఘం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరిగిన ఈ భేటీలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో సర్పంచులు బిల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పులు చేసే అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేశారని వాటికి సంబంధించిన బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారనీ, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన చిన్నారెడ్డి వారి వినతి పత్రంపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఎండార్స్మెంట్ చేశారు.

# పాఠశాల ఉపాధ్యాయుల ధ్యేయం నాణ్యమైన విద్య అందించడమే





**ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు:**

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ఉపాధ్యాయుల ధ్యేయంగా ఉండాలని మండల విద్యాధికారి డాక్టర్ రాంధన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానో పాధ్యాయుడు ధర్మ ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రాం ధన్ 'ది క్రియేటివ్ నెక్సస్' పేరుతో పాఠశాల దృశ్యమాలికను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, సృజనా త్మక కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహద పడతాయని తెలిపారు. సంఖ్యతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని, అదే ప్రస్తుత పరిస్థితుల్లో వారి ప్రధాన కర్తవ్యమని సూచించారు.గౌరవ అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యా యుడు మురళి మాట్లాడుతూ, విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారికి లభించే అవకాశా లను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహి ంచాల్సిన అవసరం ఉందని, ఆకాశమే హద్దుగా ఎదగాలని కోరారు.
విద్యార్థులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీలు, సాహితీ, సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన వారికి అతిథులు బహుమతులు అందజేశారు. విద్యా ర్థుల ప్రదర్శించిన బృంద నృత్యాలు సభను అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉమా, భాగ్యలక్ష్మితో పాటు ఉపాధ్యాయులు కవిత, సురేష్, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# నేర నిందితులను పట్టుకోవడంలో పోలీస్ జాగిలం కీలకం





**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

నేరాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం పోలీసు జాగిలాలు కీలకంగా నిలుస్తున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు నూతనంగా వచ్చిన పోలీస్ జాగిలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం పరిశీలించారు. గత 28వ తేదిన మొయినాబాద్‌లోని పోలీస్ జాగిలాల శిక్షణా కేంద్రంలో ఎనిమిది నెలల శిక్షణను పూర్తి చేసుకోని వచ్చిన ఐదు పోలీస్ జాగిలాలు వరంగల్ కమిషనరేట్ పోలీస్ డాగ్ స్క్వాడ్‌లో చేరి విధులు నిర్వహించేందుకు సిద్దమయినాయి. ప్రేలుడు పదార్థాలను పసిగట్టే ఈ ఐదు జాగిలాల్లో మూడు బెల్జియన్ మాలినోస్, రెండు గొల్డెన్ రీట్రీవర్ జాతులకు చెందిన జాగిలాలు, వీటికి రానా, జానీ, దయానా, మాక్స్, కైరో గా నామకరణం చేయడం జరిగింది. నూతనంగా వచ్చిన ఈ జాగిలాలను సంబంధించిన పూర్తి వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్‌కు హ్యాండ్లర్లు వివరించారు. గతంలోని జాగిలాలు ఎన్నో ప్రేలుడు పదార్థాలను పసిగట్టడంలో విజయం సాధించాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గుర్తు చేసారు. నూతనంగా వచ్చిన జాగిలాలకు మెరుగైన వసతిని ఏర్పాటు చేయాల్సిందిగా సిపి సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమములో అదనపు డిసిపి సురేష్‌కుమార్, ఆర్.ఐ శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌తో పాటు హ్యాండ్లర్లు రాజేష్ కుమార్, వెంకన్న, సురేష్, దిలిప్‌లు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి



**వనపర్తి తెలంగాణ ముచ్చట్లు :**

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో సద్గుణ అన్నారు. మంగళవారం పెద్దమందడి మండల పరిధిలోని ముందరి తండాలో ఉపాధి హామీ పనులు భూమి లెవలింగ్ పనులను ఎంపీడీవో సద్గుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సద్గుణ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులను కూలీల సంఖ్య పెంచాలన్నారు. రాబోయే వర్షకాలం దృష్టిలో పెట్టుకొని రైతులకు కావలసిన భూమిని లెవలింగ్ పనులను చేపట్టాలన్నారు. ఎండాకాలం కావడంతో ముందు జాగ్రత్తగా కూలీలు కు త్రాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా గ్రామాలలో కూడా ముందు జాగ్రత్తగా సమస్య లేకుండా జాగ్రత్తగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో పల్లె ప్రగతి ప్రకృతి వనంలో మొక్కలు పెంచేందుకు బ్రెడ్లు మొక్కలు వేయడానికి ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలోనే 5000 నుండి 10000 వరకు మొక్కలు పెంచడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీలకు పని కల్పించేందుకు దృష్టి సారించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం చేస్తే తగ్గున చర్యలు చేపడతామన్నారు.

# పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



**భద్రాద్రి కొత్తగూడెం భ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లాలోని బూర్గంపాడు మండల వ్యాప్తంగా ఉన్న ఐటీసీ అనుబంధ గోడౌన్లలో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు చట్టప్రకారం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు మండల కన్వీనర్ పాండవుల రామనాథం డిమాండ్ చేశారు.సిఐటియు బూర్గంపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ, యాజమాన్యాలు గత దశాబ్దాలుగా కార్మికులను తక్కువ వేతనాలతో వేధిస్తున్నాయని, కార్మిక హక్కుల కోసం సమర శంఖం పూరిస్తామని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. గోడౌన్లలో ప్రమాదాలు జరిగితే ఇన్సూరెన్స్ లేకపోవడం ఆందోళన కలిగించే విషయం అని ఆయన పేర్కొన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం, వేతనాల పెంపు కోసం సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో కార్మికుల సంఘం మండల నాయకులు గుంటక కృష్ణ, వివిధ గోడౌన్లలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.


## ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి
# డాక్టరేట్ పొందిన తోకల విజయ కుమార్




**రఘునాథపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలం, కుర్చపల్లి గ్రామానికి చెందిన తోకల విజయ కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు. "పబ్లిక్ మరియు ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో డిజిటల్ బ్యాంకింగ్ వినియోగంపై రిస్క్ మరియు రివార్డ్స్ కస్టమర్ల ప్రభావం" అనే అంశంపై డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన చేసి, ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డిగ్రీ అందుకున్నారు.విజయ కుమార్ తెలంగాణ విశ్వవిద ్యాలయంలో ఎం.కామ్ పూర్తి చేసి నెట్, జేఆర్ఎఫ్, సెట్ అర్హతలను సాధించారు. అదనంగా, అంబేద్కర్ విశ్వవిద్యా లయం నుండి ఎంబీఏ డిగ్రీను పూర్తిచేసి సెట్ అర్హత పొందారు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆధ్యాపకునిగా పనిచేస్తున్నారు.విజయ కుమార్ డాక్టరేట్ పొందిన సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మిత్రులు అభినందనలు తెలియజేశారు.

# ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన





**హసన్‌పర్తి,తెలంగాణ ముచ్చట్లు**

హసన్‌పర్తి మండలం, ఎల్లాపూర్ గ్రామ శివారులో గల ఆర్బిట్ ఇ-టెక్నో పాఠశాలలో మంగళవారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను నూతన ఆవిష్కరణలుగా మలచాలని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి, దేశానికి మంచి పేరు తేవాలని కోరారు.నిత్య జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను విద్యార్థుల ను దృష్టిలో పెట్టుకొని, వాటిని నియంత్రించడానికి పరిష్కార మార్గాలను చూపే విధంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో అందుబాటులో ఉన్న పరికరాలను ఉపయోగించి 100కు పైగా కొత్త వస్తు కళాఖండాలు తయారు చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో రోబో, గడ్డిని కోసే పరికరం, మూత్రపిండాలు పనిచేసే విధానం, వాటర్ ఓవర్ లో అలారం, శ్వాస వ్యవస్థ పరమాణు నిర్మాణం, మినీ చిల్లి కట్టర్, హైడ్రాలిక్ బ్రేక్, ఎయిర్ కూలర్, ఇరిగేషన్, అగ్నిపర్వతం, వాటర్ స్మోకింగ్, రోడ్డు పాన్ హౌస్ మొదలైనవి విద్యార్థిని విద్యార్థులు తయారు చేసినట్లు చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిహెచ్.హారిక-భగవాన్ రెడ్డి అకాడమిక్ ఇంచార్జ్ వాసుదేవ రెడ్డి, గణిత, సైన్స్ విభాగానికి చెందిన ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు వెంకటేష్, రంజిత్, వినయ్ కుమార్, ఇంద్రాణి,రాజ్ కుమార్, రూపా దేవి, శ్రీకాంత్, కృష్ణవేణి, శ్వేతా రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకై బిఎస్పీతో కలిసి రండి


**భద్రాచలం అదనపు ఇన్చార్జి తడికల శివకుమార్ :**

**బహుజన సమాజ్ పార్టీ వాజేడు మండల నూతన కమిటీ నియామకం...**

**వాజేడు మండల అధ్యక్షులుగా కారం చిరంజీవి....**

**తెలంగాణ ముచ్చట్లు, (వాజేడు ) ములుగు జిల్లా**

రాజ్యాంగ పరిరక్షణకై బహుజన సమాజ్ పార్టీతో కలిసి రావాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్, భద్రాచల నియోజకవర్గ అదనపుఇంచార్జ్ తడికల శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం భద్రాచలం నియోజకవర్గం ఉపాధ్యక్షులు, వాజేడుమండల ఇన్చార్జి కుమ్మరి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన పాత్రికేయుల ముఖాముఖిలో శివకుమార్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ. రాజ్యాంగ రక్షణకై పాటు పడుతుందని, రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 12 నుండి 35 వరకు ఉన్న ప్రాథమిక హక్కుల సంరక్షణకై నిరంతరం పోరాడుతుందని తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు ప్రాంతంలో 1950 కి పూర్వం నివసిస్తున్నటువంటి అన్ని వర్గాల ప్రజలని ఎస్టీ జాబితాలో చేర్చాలని బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగపరంగా చెప్పినప్పటికీ పాలక ప్రభుత్వాలు అది నెరవేర్చటంలో వైఫల్యం చెంది కొన్ని వర్గాల మధ్య అనేక సమస్యలకు కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆర్టికల్ 14, ఆర్టికల్ 17, ఆర్టికల్ 21, అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటి పరిష్కారం కొరకు బహుజన్ సమాజ్ పార్టీలో ఎస్సీలు ఎస్టీలు బీసీలు ఆధిపత్య కులాలలోని పేదలు మహిళలు, బి ఎస్ పి కి రాజ్యాధికారం అందించడం ద్వారా సమస్యలన్ని పరిష్కారం అవుతాయని పునరుద్ఘాటించారు. ఎస్సీ ఎస్టీ బీసీలు మత మైనార్టీలు, బహుజన సమాజ్ పార్టీ చేసే సామాజిక ఉద్యమానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్షులు కొండ చరణ్ వాజేడు మండల అధ్యక్షునిగా కారం చిరంజీవికి నియామక పత్రాన్ని అందించి నియమించారు. ఈ సందర్భంగా కొండ చరణ్ మాట్లాడుతూ భవిష్యత్తు రాజకీయాలు బహుజన వాదానిదేనని, ఎస్సీ ఎస్టీ బీసీ బహుజనులు అంతా బిఎస్పి తో కలిసి రావాలని కోరారు. అదేవిధంగా కారం చిరంజీవి తన మండల కమిటీ సభ్యులకు నియామక పత్రాలు ఇచ్చి నియమించుకున్నారు. వాజేడు మండల ఉపాధ్యక్షులుగా దుర్గం దేవ సహాయం, ప్రధాన కార్యదర్శిగా జనగం కేశవరావు, కోశాధికారి జాడి రామకృష్ణ, కార్యదర్శి సాధనపెల్లి మోహన్ రావు, మండల ఇసీ నెంబర్ కుమ్మరి స్వర బాబు లు నియమించారు. ఎన్నికైన కమిటీ సభ్యులు సెక్టార్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కావేరి మధు, సప్పిడి సాంబ శివరావు, కుమ్మరి ఏసు, సప్పిడి రాంబాబు, సప్పిడి బాబు, ఎస్.కె అజ్జు, గజ్జల శివ, గజ్జల శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# చిట్యాల గ్రామాన్ని విలీనం చేయొద్దు



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి మండలం చిట్యాల గ్రామాన్ని వనపర్తి మునిసిపాలిటీలో విలీనం చేయకూడదని కోరుతూ మంగళవారం గ్రామ నాయకులు రఘుపతిరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి వినతిపత్రాన్ని సమర్పించారు. అందుకు సనుకులంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయం మేరకే నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించినట్లు వారు పేర్కొన్నారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి



**జనగామ,తెలంగాణ ముచ్చట్లు:**

పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో గల 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఉప కేంద్రం నిర్వహణ తీరును, ఫ్యూజ్ కనెక్షన్, విద్యుత్ డిమాండ్, తదితరాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లాగ్ బుక్ ను తనిఖీ చేసి, రికార్డుల్లో వివరాలను సరైన విధంగా నమోదు చేయాలని,అలాగే ఆన్లైన్ లో కూడా పొందుపరచాలని,అదే విధంగా విద్యుత్ ప్రజావాణి గురించి ఆరా తీసి విద్యుత్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని,ట్రిప్ అయితే వెంటనే స్పందించాలని,వేసవి కాలంలో ఎక్కడా కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా,విద్యుత్ కొరత రాకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని,ఈ క్రమంలో విద్యుత్ అధికారులు వివరిస్తూ నియోజకవర్గ పరిధిలో 10 సబ్ స్టేషన్‌లు ఉన్నాయని, సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ రాకేష్, ఆపరేటర్ నయీం, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల కంటే వ్యక్తిత్వమే గొప్పదని నిరూపించిన ఆదర్శవ్యక్తి రాం రెడ్డి



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

రాజకీయాల కంటే వ్యక్తిత్వ విలువలు ను గౌరవించే వ్యక్తి, నిక్కచ్చితమైన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం, నేటి రాజకీయాలకు దివంగత నేత రాం రెడ్డి వెంకట్ రెడ్డి ఆదర్శ వ్యక్తి అని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ రోడ్‌లో దివంగత నేత మాజీ మంత్రి రాం రెడ్డి వెంకట్ రెడ్డి 9వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్ తో పాటు పలువురు నేతలు వారి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ ఈనాడు రాజకీయాలు ఎంతో కల్మషం అయినప్పటికీ రాజకీయాలు శాశ్వతం కాదు వ్యక్తిత్వ విలువలే ప్రధానమని నిరూపించడం వలన ఇప్పటికీ ప్రతి తండాలో ప్రతి హరిజనవాడలో, ప్రతి గుండెలో చిరస్థాయిగా రాంరెడ్డి వెంకట్ రెడ్డి నిలిచిపోయారని, తెలిపారు. కన్నతల్లికి కష్టమొచ్చినా ఓర్చుకుంటాను గాని కార్యకర్తలకు కష్టం వస్తే సహించను అనేవారని, మాటలతో కాకుండా చేతలతో, ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ కార్యకర్తలను, వెన్నంటి కాపాడుకున్న మహా వ్యక్తి అని, తన జీవితకాలంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని వీడిపోని గుండె ధైర్యం గల వ్యక్తి రాంరెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, నాయకులు తోటకూరి శివయ్య, నల్లమోతు లక్ష్మయ్య గుజ్జర్లపూడి రాంబాబు, రాంరెడ్డి జగన్నాథ్ రెడ్డి, ధరావత్ అనురాధ, కోటి, దొడ్డ వేణు, బట్టు నాగ బానోతు లాల, సిరిపురపు రవి, వీరస్వామి, మాలోత్ ప్రేమ్ కుమార్ పందుల రామ్మూర్తి పాల్గొన్నారు

# విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండల కేంద్రములోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వారికి కేటాయించిన తరగతిలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు రాబోవు పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పై స్థాయికి వెళ్లాలని వారు కోరారు. ఒక రోజు కలెక్టర్ గా శ్రీలత, జిల్లా విద్యాధికారి నందిని, జిల్లా ఉపవిద్యాధికారి శ్రీదేవి, మండల విద్యాధికారిని మాధురి, ఆర్ .జె.డి సిద్ర, ఫిజికల్ డైరెక్టర్ ప్రవళిక స్వయం పరిపాలన దినోత్సవం ద్వారా ఒకరోజు వారి వారి హోదాలో బాధ్యతలు చేపట్టారుఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఉపాధ్యాయులు శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్నెం మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలి

- ▶ వైద్య శాఖ ప్రజలకు సేవా దృక్పథంతో పని చేయాలి
- ▶ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలి
- ▶ ఆసుపత్రి ఏర్పాటు చేసిన వైద్య సేవల సూచికలు, హెల్ప్ డెస్క్ పరిశీలన
- ▶ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్పథంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం జిల్లా కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని క్యాజువాలిటి, వెయిటింగ్ హాల్, ల్యాబ్, డయాగ్నొస్టిక్ సెంటర్, ఎంపిహెచ్ డబ్ల్యు. ట్రైనింగ్ సెంటర్, ఎంసిహెచ్, ఓపి, ఇన్ పెషెంట్ వార్డు, అవుట్ పేషేంట్ వార్డు, గుండె సంబంధిత సెంటర్, కళ్ల చికిత్స కేంద్రం, గర్భిణీ స్త్రీల వార్డ్, మైత్రి ట్రాన్స్ క్లినిక్, మందులు, సరుకులు నిల్వ చేసే స్టోర్ రూమ్ లను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందుల నిల్వలు సరిపడా ఉండే విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలని తెలుపుతూ, ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ అధికారులతో కలిసి ఆసుపత్రి మొత్తం తిరిగి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలిం చారు. కావలసిన వసతి ఏర్పాట్లపై, పార్కింగ్, టాయిలెట్స్ నిర్మాణాల కోసం అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. దివ్యాంగులచే నిర్వహిస్తున్న పెయిడ్ పార్కింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా హాస్పటల్ లో నడుపుతున్న క్యాంటీన్ ను కలెక్టర్ సందర్శించారు. నిర్వాహకులతో ముచ్చటించారు. వైద్య కోసం వచ్చే వారికి, వారి సహాయకులకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించవద్దని సూచించారు. ఆనతరం హాస్పటల్ లో రోగులకు, వారి సహాయకులకు సత్యసాయి సేవా అన్నదానం కార్యక్రమంలో కలెక్టర్ భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించడం, సేవా దృక్పథంతో పని చేయడం వైద్య శాఖలో చాలా అవసరమని అన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందించే పౌష్టికాహారం, భోజనం రుచికరంగా, పౌష్టికాహారంతో కూడుకున్నదై ఉండాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో మందుల రికార్డులు, ఇతర రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులకు వివరించారు.

హాస్పిటల్ నందు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం క్రింద జిల్లా ఆసుపత్రిలో ఎన్.సి.డి. క్లినిక్ విభాగం ఏర్పాటు చేసి రక్తపోటు, వృద్ధాప్య సేవలు, మానసిక సమస్యలు, కిడ్నీ, కాలేయ సమస్యలు, నోటి సమస్యలు, క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాత నివారణకు వైద్య సౌకర్యాలు కల్పించమని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎల్. కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి. కిరణ్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.





# బర్డ్ ఫ్లూ వణికిస్తుంది

**మెదక్, తెలంగాణ ముచ్చట్లు:**

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రజలను కొద్దిరోజులుగా బర్డ్ ఫ్లూ వణికిస్తుంది. బర్డ్ ఫ్లూ వేగంగా వ్యాప్తి చెందడంతో చికెన్ తినాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. చికెన్ ముక్కలేనిదే ముద్దదిగని వారుసైతం నెల రోజులుగా చికెన్ కు దూరమయ్యారు. అయితే, గత వారం రోజులుగా బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ తగ్గుముఖం పట్టడంతో చికెన్ దుకాణాల వద్ద మాంసాహారుల క్యూ పెరుగుతోంది. ఫలితంగా ఇన్నాళ్లు తగ్గిన చికెన్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అయితే, తాజాగా.. 8వేల కోళ్లు మృత్యువాత పడటం కలకలం సృష్టిస్తోంది. రాష్ట్రంలోని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడటమే ఇందుకు కారణం. ఈ రెండు జిల్లాల్లో ఏకంగా ఎనిమిది వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం సమీపంలోని ఓ పౌల్ట్రీఫాంలో మూడు రోజుల వ్యవధిలో ఏడు వేల కోళ్లు మరణించాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిని జలాల్పూర్ లోని ఓ కోళ్ల ఫారంలో మూడు రోజుల్లో వెయ్యికి పైగా కోళ్లు వింత వ్యాధితో చనిపోయాయి. దీంతో బర్డ్ ఫ్లూ వల్లే ఈ కోళ్లు చనిపోయాయన్న చర్చ జోరుగాసాగుతుంది.

# మార్చి 6న జాబ్ మేళా నిర్వహణ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 6న గురువారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లోని వై.ఎస్.కె. ఇన్ఫో టెక్ ప్రైవేటు లిమిటెడ్ లో అసెంబ్లింగ్ ఆపరేటర్, టెక్నికల్ టీమ్ సపోర్ట్, క్వాలిటీ చెకర్స్ ఖాళీల కొరకు ఎస్.ఎస్.సి., ఐ.టి.ఐ., ఏదేని డిగ్రీ పాస్, ఫెయిల్ అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి వేతనం 16 వేలు ఉంటుందని అన్నారు.

అలాగే హైదరాబాద్‌లోని జి.జే. సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ ఖాళీల కొరకు ఏదేని డిగ్రీ అర్హత కలవారు దరఖాస్తు చేసుకోవాలని, వేతనం 13 వేలు ఉంటుందని అన్నారు. మొత్తం 500 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏఐ ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
సర్కారు బడిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేథ)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 53వ డివిజన్ ఎన్.ఎస్.పి. కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏ.ఐ. విద్యా బోధనను పరిశీలించి, ఏ.ఐ. విద్యా బోధనకు అవలంబిస్తున్న పద్ధతులను తెలుసుకున్న కలెక్టర్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏ.ఐ.) ను వినియోగిస్తూ విద్యార్థులను ఆకట్టుకునేలా సులభ రీతిలో బోధన ప్రారంభించాలని అన్నారు. విద్యార్థులకు మంచి లెర్నింగ్ ఎక్స్పీరియన్స్ దక్కేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు ఏ.ఐ. సహాయంతో నూతన బోధన పద్ధతులను ప్రవేశపెట్టిందని, మన ఖమ్మం జిల్లాలో 7 ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా పైలెట్ ప్రాజెక్టు క్రింద ఏ.ఐ. విద్యా బోధనను ప్రారంభిస్తున్నామని, ఖమ్మం అర్బన్ ప్రాంతంలో నాలుగు పాఠశాలలు, నేలకొండపల్లి మండలం సింగిరెడ్డి పాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సత్తుపల్లి మండలంలోని సిద్దారం, ఎన్టీఆర్ నగర్ లలో ప్రాథమిక పాఠశాలలో ఈ బోధన ఏర్పాటు చేశామని అన్నారు.ఏ.ఐ. కోర్సు ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా ఉంటుందని, విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తూ దానికి అనుగుణంగా బోధన జరిగేలా ఏ.ఐ. కోర్సులు రూపొందించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాలు పెంచేలా ఏ.ఐ. ను వినియోగించడం జరుగుతుందని, పిల్లలు తెలుగు, ఆంగ్లం బాగా చదివి, రాసేలా, గణిత అంశాల్లో పట్టు సాధించేలా చూడడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఎన్.ఎస్.పి. పాఠశాలలో 3 నుండి 5వ తరగతిలో వెనకబడిన ప్రతి 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి, ప్రస్తుతం తెలుగు, గణితంలో ఏ.ఐ. ద్వారా పాఠాలను బోదించడం జరుగుతుందని అకడమిక్ మానిటరింగ్ అధికారి రవి కుమార్ కలెక్టర్ కు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాలల్లో ఏఐ పాఠాలు నేర్చుకుంటున్న చిన్నారులతో ముచ్చటించారు. పిల్లలతో ఏ.ఐ. ద్వారా తెలుగు చదివించి వాటి అర్థం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి కె. రవి కుమార్, ఎం.ఈ.ఓ. శైలజా లక్ష్మీ, జి.సి.డి.ఓ. తులసి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్రి వెంకన్న, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# మిర్చి కొనుగోళ్ల లో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు...

- మార్కెట్ లో జరుగుతున్న కొనుగోళ్ల జాప్యం పై ఆగ్రహం...
- మిర్చిని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని అధికారులకు అదేశాలు
- ఖమ్మం మిర్చి యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
నాణ్యమైన మిర్చికి ధర తగ్గించి, మిర్చి కొనుగోలు విషయమై రైతులను ట్రేడర్లు మోసం చేస్తే ఏమాత్రం ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు.నాణ్యత మేరకు మిర్చికి ధర రావడం లేదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మిర్చి మార్కెట్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిర్చి యార్డును కలియతిరిగి కొనుగోళ్ళను పరిశీలించారు. గిట్టుబాటు ధరకే మిర్చి కొనుగోలు చేయాలని వ్యాపారులకు కలెక్టర్ సూచించారు. తేమశాతం కోసం మిరపకాయలు పట్టుకుని నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, సరుకు బాగానే ఉన్నా తక్కువ ధర చెల్లిస్తున్నందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతను వ్యాపారులు ఎలా నిర్ధారిస్తారని అధికారులను ప్రశ్నించారు. మార్కెట్కు వచ్చిన కలెక్టర్ తో మిర్చి రైతులు, మిర్చి ధరలు గణనీయంగా తగ్గిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. జెండా పాటకు వేలం వ్యత్యాసంతో వ్యాపారులు మిర్చి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో చాలా నష్టాలు వస్తున్నాయని రైతులు తెలిపారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిర్చి కొనుగోళ్లలో జాప్యం చేయకూడదని, అన్నదాతలకు వెంటనే చెల్లింపులు చేయాలని వ్యాపారులకు అన్నారు. మిర్చి పంట కొనుగోళ్లు సాగుతున్న తీరుపై, జెండా పాటకు, రైతుకు దక్కే ధరకు పొంతన లేదని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదంటూ అధికారులను హెచ్చరించారు. నాణ్యత పేరుతో రైతులను ఖరీదుదారులు నష్ట పరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వారి లైసెన్సలను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.ప్రతి బస్తా కొనుగోలు అయ్యే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని ధైర్యపరిచారు. రైతులకు ఇబ్బంది కలిగించే చర్యలు ఏవరు చేసిన ఉపేక్షించబోమని అన్నారు. అన్నదాతలకు న్యాయం జరిగేలా అధికారులు వారికి అండగా ఉండాలని ఆదేశించారు.ఖమ్మం మార్కెట్ లో రైతులకు గిట్టుబాటు ధర అందేలా నిరంతరం పర్యవేక్షిస్తామని అన్నారు. వ్యాపార లావాదేవీలను, సరుకు నాణ్యతను మార్కెట్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఇతర శాఖలను సమన్వయం చేసుకుని, రైతుకు సరైన ధర లభించేలా చర్యలు చేపట్టాలన్నారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, అధికారులు, ఉన్నారు.



# వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న రౌడీషిటర్ నవీన్, మరోవ్యక్తి అరెస్ట్



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
గత కాలంగా నగరంలో పలు నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రంతులకు గురిచేస్తున్న రౌడీ షీటర్ ముద్ధంగుల నవీన్(29) తో పాటు పాత నేరస్తుడు మంజుల విజయ్ కుమార్ (27) లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. విజబుల్ పోలీసింగ్ లో భాగంగా సోమవారం బిఆర్ఎస్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎన్ఎస్పీ కాలనీలో ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని విచారించగా ద్వారక నగర్ ప్రాంతానికి చెందిన పాత నిందుతులు ముద్ధంగుల నవీన్, మంజుల విజయ్ కుమార్ గా గుర్తించి అరెస్ట్ చేసినట్లు వివరాలు తెలిపారు. గత నెల 9 న ఎన్ఎస్పీ కాలనీలో స్కూటీపై వెళుతున్న వ్యక్తి అపి బెదిరించి బ్యాగ్‌లో వున్న 30,000/- రూపాయలు లాక్కొని పారిపోయారని, అదేవిధంగా అదేవిధంగా ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవిరాజునగర్ లో గత నెల 14వ తేదీ అర్ధరాత్రి మోటార్ సైకిల్ పై వెళ్తున్న వ్యక్తి కళ్ళల్లో కారం చల్లి బ్యాగు లాక్కొనటానికి ప్రయత్నించగా అతను ప్రతిఘటించడంతో వీరిద్దరూ పారిపోయినారని పోలీసుల విచారణలో నిందుతులు వెల్లడించారని తెలిపారు. ఎవరైనా మోటార్ సైకిల్ మీద బ్యాగులల్లో డబ్బులు తీసుకు వెళ్తున్న వారిని గమనించి వారిని అడ్డగించి డబ్బులు లాక్కోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారని అన్నారు. ఈ కేసులోని మొదటి వ్యక్తి అయినా నవీన్ ఖమ్మంలో గత కొన్ని సంవత్సరాల నుంచి రోడ్లపై గొడవలు చేస్తూ సెటిల్మెంట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, అలాగే రెండు హత్యయత్నంతో పాటు సుమారుగా 10 కేసులలో నిందుతుడుగా వుండి జైలుకు పోయి బెయిల్ పై వచ్చినట్లు తెలిపారు. ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ కూడా ఉందని పెర్కొన్నారు. మరో నిందుతుడు మంజుల విజయ్ కుమార్ పై 2021 సంవత్సరంలో ఖమ్మం అర్బన్ పోలీసులలో గంజాయి కేసు కూడా ఉందని తెలిపారు.వీరి నుండి ఒక స్కూటీని సెల్ ఫోన్ స్వాధీనపరచుకోవడం జరిగిందని తెలిపారు.





# వేసవి దృష్ట్యా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
వేసవిలో వడ గాల్పుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ ఉపాధి హామీ కార్మికులకు సూచించారు.మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో ఉపాధి హామీ కూలీలను కలిసి ముచ్చటించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న సేవలు, ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న మార్పులు, తదితర అంశాలను అదనపు కలెక్టర్ వివరించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పని వేళలో మార్పులు చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల మధ్య చల్లని త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. వడ గాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటికి రావడం, వేడి గాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి వివిధ అంశాలను పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 11 లోపు ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ కోసం దరఖాస్తు సమర్పించాలి

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**
మార్చి 11 లోపు ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ కోసం దరఖాస్తు సమర్పించాలని జిల్లా పరిశ్రమల అధికారి టి. సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ కి ఎంపికైన విద్యార్థులకు నెలవారి ఐదువేల రూపాయల భత్యం, ఒకేసారి 6 వేల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని, 12 నెలల పాటు ఇంటర్న్ షిప్ కాల వ్యవధిలో కనీసం ఆరు నెలల ఉద్యోగ శిక్షణ ఉంటుందని, వాస్తవ ప్రపంచ అనుభవాన్ని పొందేందుకు వృత్తిపరమైన వాణిజ్య నెట్వర్క్ రూపొందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేందుకు ఇంటర్న్ షిప్ ఉపయోగపడుతుందని అన్నారు. 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల యువత ఇంటర్న్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, వీరి కుటుంబంలో ఎవరు ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదని, గత సంవత్సరపు కుటుంబ సంవత్సర ఆదాయం 8 లక్షల లోపు ఉండాలని, పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిప్లొమా, డిగ్రీ చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.దరఖాస్తు ప్రక్రియ మార్చి 11 లోపు పూర్తి చేయాలని ఆసక్తి అర్హత కలవారు pmintern ship.mca.gov.in పోర్టులో లాగిన్ చేసి ఆసక్తి గల వివిధ రంగాలలో అవకాశాలు అన్వేషించి గరిష్టంగా ఐదు ఇంటర్న్ షిప్ లను ఎంపిక చేసుకోవచ్చని, ఇతర వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 11 6090 లో సంప్రదించాలని జిల్లా పరిశ్రమల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

● మొదటిపేజీ తరువాయి
నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు.ఈ పరీక్షల వేళ.. స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ.. చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు.ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించ నున్నారు.విద్యార్థుల పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ హెల్ప్‌లైన్ నెంబరు 92402 05555ను సంప్రదించవచ్చునని బోర్డు కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

# పడిపోతున్న ఫెర్టిలిటీ రేటు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఫర్టిలిటీ రేటు క్రమంగా తగ్గుతోంది. ఇది భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే గణనీయమైన ధోరణిని సూచిస్తోంది. ఫర్టిలిటీ రేటు అనేది ఒక స్త్రీ తన జీవితకాలంలో సగటున ఎంతమంది పిల్లలకు జన్మనిస్తుందనే సూచిక. ఈ రేటు తగ్గడం వల్ల జనాభా వృద్ధి, సామాజిక?ఆర్థిక పరిస్థితులపై ప్రభావం పడుతుంది.తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, తెలంగాణలో ఫర్టిలిటీ రేటు 1.8కి పడిపోయింది. ఇది రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి (2014) గణనీయమైన తగ్గుదలను చూపిస్తోంది. 2015?16)లో ఈ రేటు 1.9గా ఉండగా, దీనికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో (2011 సమయంలో) ఇది 1.8?2.0 మధ్య ఉండేది.నగరీకరణ: హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో జీవనశైలి మార్పులు, విద్య, ఉపాధి అవకాశాలు పెరగడం. విద్య, అవగాహన: మహిళల్లో విద్యాస్థాయి పెరగడం, కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన పెరగడం.వివాహ వయస్సు పెరుగుదల: ఆలస్యంగా వివాహాలు జరగడం వల్ల పిల్లల సంఖ్య తగ్గుతోంది.ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఫర్టిలిటీ రేటు 5 ప్రకారం 1.7కి తగ్గింది, ఇది 4లో 1.8గా ఉండేది. దీని అర్థం ఈ రాష్ట్రంలోనూ జననాల సంఖ్య స్థిరంగా తగ్గుతోంది. ఈ రాష్ట్రంలో తగ్గుదలకు కారణాలు తెలంగాణతో సమానంగా ఉన్నప్పటికీ, కొన్ని అదనపు అంశాలు కూడా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మార్పు: గ్రామీణ ప్రాంతాల్లో కూడా కుటుంబ నియంత్రణ పద్ధతుల వినియోగం పెరగడం.ఆర్థిక ఒత్తిడి: జీవన వ్యయం పెరగడం వల్ల చిన్న కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వడం.ప్రభుత్వ విధానాలు: కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు మెరుగుపడటం.

# రైతులకు మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :** రైతులు ఆరుగాలం కష్టపడి వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు మిర్చిని అమ్మకానికి తీసుకొస్తే రైతులకు సౌకర్యాలు లేవని రైతులకు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రైతు సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెట్‌కు రోజురోజుకు మిర్చి రైతులు బస్తాలు తీసుకురావడం పెరుగుతుంది ఓ పక్కన ఎండలు విపరీతంగా కొడుతున్నాయి రైతులు ఇతర జిల్లాల నుండి, ఆయా గ్రామాల నుండి రాత్రి బయలుదేరి మార్కెట్‌కు వచ్చిన తర్వాత రోజంతా మార్కెట్లోనే కాంటాలు అయ్యేదాకా ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుంది ఈ ఎండల వలన అస్వస్థతకు గురికాకుండా రైతులను చూసుకోవలసిన బాధ్యత మార్కెట్ అధికారులకు ఉందన్నారు. రైతులకు తక్షణ ఉపశమానికి మార్కెట్లో మజ్జిగ అందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య జిల్లా ఉపాధ్యక్షులు ఊరటి అంశాల్ రెడ్డి కమిటీ సభ్యులు రాజు, రవీందర్ పాల్గొన్నారు.

# యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :** యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాకు చెందిన బిట్ల వర్షిని పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు బిట్ల దేవశ్రీవల్లభ - రాణి దంపతులు మరియు సోదరి బిట్ల హాసిని సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డులో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిట్ల దేవశ్రీవల్లభ, రమా రాణి, బిట్ల హాసిని, బిట్ల వర్షిని, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వి, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), యాద రవి కుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మండల భూపాల్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



**భద్రాద్రి ప్రతినిధి,తెలంగాణ ముచ్చట్లు :** మంగళవారం మణుగూరు తహశీల్దార్ కార్యాలయంలో. అలాగే జిల్లా కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మరియు జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు చందా లింగయ్య దొర నాయకత్వంలో, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మణుగూరు, పినపాక మండలాలలో భూములు కోల్పోయిన గిరిజన రైతులు న్యాయం చేయాలని కోరారు. చందా లింగయ్య దొర మాట్లాడుతూ 2014 సంవత్సరం నుండి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో... రెండు పర్యాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ కూడా భూ నిర్వాసితులైన ఆదివాసులకు న్యాయం జరగలేదు. ఆదివాసీల భూములలో ఇతరుల పేర్లు పహానిలో ఎక్కించి దాదాపు రూ 400 వందల కోట్ల రూపాయలు కాజేసి ఆదివాసీలకు మొండిచెయ్యి చూపించినారు. మణుగూరు మండలం, రామంజవరం రెవిన్యూ గ్రామం సర్వే నెంబరు 853లో సుమారు 1250 ఎకరాల ఆదివాసి భూములను రికార్డులు మార్చి ఆదివాసులకు అన్యాయం చేసినారు.. ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని కోరారు. సీనియర్ ఆదివాసి నాయకులు పూనెం జయగోపాల్, చిడెం నాగేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు కుంజా వెంకటరమణ భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శిగొగ్గల ఆర్కే దొర పినపాక మండల అధ్యక్షులు కొమరం శ్రీను మణుగూరు మండల అధ్యక్షులు పాల్వంచ వెంకటేశ్వర్లు కుంజ నాగేశ్వరరావు, నాలి మహేష్, మడి గౌతమి, ఏనిక ఉషారాణి, పూణెం విజయలక్ష్మి, కుంజా ఆదిలక్ష్మి, పొడెం నరసమ్మ, ఏనిక మంగమ్మ, మునిగల శారద, ఏనిక రజిని, మడకం నాగమణి, ఊకే సమ్మక్క, కారం మమత, లక్కె స్వరూప, మడకం శ్రీను, కుంజ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారులు పొలం బాట పట్టాలి



**మహబూబాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** రైతులకు మెరుగైన , ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా విద్యుత్ అధికారులు నేరుగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించే కార్యక్రమం విద్యుత్ అధికారుల పొలం బాట అని మహబూబాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జె .నరేష్ తెలిపారు మంగళవారం కొత్తగూడ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 185 పొలంబాట కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఇందులో 1565 వంగిన స్థంబాలు, 2522 లూజ్ లైన్లు , 2685 మధ్య స్థంబాలు ఏర్పాటు చేశామని అన్నారు. ట్రాన్స్ఫార్మర్ల ఫేల్యూర్లు కాకుండా సరిగ్గా ఎర్తింగ్ ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, కెపాసిటర్లు అమర్చడం ద్వారా మోటార్లు మరింత కాలం మన్నికగా ఉండేందుకు దోహద పడుతాయన్నారు. లో వోల్టేజ్ సమస్య ఉండదన్నారు. ఆటో స్టార్టర్లు కూడా తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. అలాగే జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్ లోని టెక్నికల్ అధికారులు కృషి చేయాలని అన్నారు.

# నిందితులను పట్టుకోవడంలో పోలీస్ జాగిలం కీలకం

**వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ**



**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :** నేరాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం పోలీసు జాగిలాలు కీలకంగా నిలుస్తున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు నూతనంగా వచ్చిన పోలీస్ జాగిలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళ వారం పరిశీలించారు. గత 28వ తేదిన మొయినా బాద్ లోని పోలీస్ జాగిలాల శిక్షణా కేంద్రంలో ఎని మిది నెలల శిక్షణను పూర్తి చేసుకోని వచ్చిన ఐదు పోలీస్ జాగిలాలు వరంగల్ కమిషనరేట్ పోలీస్ డాగ్ స్క్వాడ్‌లో చేరి విధులు నిర్వహించేందుకు సిద్దమయి నాయి. పేలుడు పదార్థాలను పసిగట్టే ఈ ఐదు జాగిలాల్లో మూడు బెల్జియన్ మాలినోస్, రెండు గోల్డెన్ రీట్రీవర్ జాతులకు చెందిన జాగిలాలు, వీటికి రానా, జానీ,దయానా,మాక్స్, కైరోగా నామకరణం చేయడం జరిగింది. నూతనంగా వచ్చిన ఈ జాగిలాలను సంబంధించిన పూర్తి వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్‌కు హ్యాండ్లర్లు వివరించారు. గతంలోని జాగిలాలు ఎన్నో పేలుడు పదార్థాలను పసిగట్టడంలో విజయం సాధించాయని గుర్తు చేసారు. నూతనంగా వచ్చిన జాగిలాలకు మెరుగైన వసతిని ఏర్పాటు చేయాల్సిందిగా సిపి సంబంధిత అధికారుల ను అదే శించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి సురేష్‌కుమార్, ఆర్.ఐ శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇంచా ర్జ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌తో పాటు హ్యాండ్లర్లు రాజేష్ కుమార్, వెంకన్న, సురేష్, దిలిప్‌లు పాల్గోన్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: పెద్ది

**నర్సంపేట, తెలంగాణ ముచ్చట్లు :**



రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, వడ్ల బోనస్ మరియు రైతు బీమా పథకం ఎగవేతకు కుట్ర చేస్తుందని బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా రైతులకు చెల్లించవలసిన 438 కోట్ల వడ్ల బోనస్ అడుగుతున్నారని వడ్ల కొనుగోలు కేంద్రాలను బ్లాక్ మెయిల్ చేస్తూ , కౌలు రైతుల విచారణ పేరు మీద కాలయాపన చేస్తున్నారన్నారు నర్సంపేట నియోజకవర్గనికి మంజూరైన రెండో విడత పంట నష్టపరిహారం 2630 మంది రైతులకు డబ్బుల చెల్లింపు జరగలేదు రెండు లక్షల లోపు రైతుల రుణమాఫీ ఇంకా అసంపూర్తిగానే మిగిలి ఉంది రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే చోద్యం చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయాన్నారు.

రైతులు అల్లాడుతుంటే ఢిల్లీ యాత్ర చేస్తున్న ముఖ్యమంత్రి రైతు బీమా కోసం ఎల్ఐసీ ప్రీమియం చెల్లించని రేవంత్ సర్కార్ రూ.750 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్ పెట్టిందన్నారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలన వల్ల ఇప్పటికే 476 మంది రైతులు మరణించారు, రైతులకు రైతు బీమా కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సుమారు రూ.750 కోట్ల బకాయిలు పెండింగ్ పెట్టారు సకాలంలో ప్రీమియం చెల్లించనందు వలన రైతు బీమా మంజూరు ఆలస్యం అవుతుంది, దాదాపు 3 వేలకు పైగా కుటుంబాల కు రైతు బీమా పరిహారం దక్కలేదు ఒక వైపు కాంగ్రెస్ తెచ్చిన కరువుతో జనాలు గోస పడుతుంటే కనీసం వారు చనిపోయాక రైతు బీమా కూడా ఇవ్వట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురి చేయొద్దు

**శాయంపేట, తెలంగాణ ముచ్చట్లు ):**



ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు ఫీజులు చెల్లించ కుండా హాల్ టికెట్ ఇవ్వమని వేధింపులకు గురి చేస్తే ఊరుకునేది లేదని బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద సురేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేష్ మాట్లాడు తూ పేద మధ్యతరగతి పిల్లలను కూలి పనులు చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తున్నా రని, ఫస్ట్ నుండి విద్యాసంస్థలకు ఫీజులు కట్టడానికి అప్పులు చేసి చదివిస్తున్నారని అన్నారు. ఇంటర్ పరీక్షలను అవసరం చేసుకుని విద్యా సంస్థల యాజమాన్యం విద్యార్థులను ఫీజులు కట్టాలని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తే మంచిది కాదని అన్నారు. పిల్లల తల్లిదండ్రుల నుండి అదనంగా డబ్బులు దండుకోవాలని విద్యా సంస్థల యాజమాన్యం కుట్రలు పన్నుతున్నారని అన్నారు.

# రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను సాధించాలి



**మహబూబాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** సిపిఐ ఎంఎల్ ప్రజా పందా రాష్ట్ర మాజీ కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకు పాటుపడదామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. మార్చి 9న ఖమ్మంలో జరుగు 9 వ వర్ధంతి సభ పోస్టర్స్ ను జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో పనిచేసి భారత విప్లవోద్యమానికి వేగుచుక్కల బోస్ నిలిచారని అన్నారు. విప్లవోద్యమంలో తలెత్తిన అతివాద, మితవాద అవకాశవాదాలను ఎండగాడుతూ ప్రజాయుద్ధ పందాను అభివృద్ధి చేశాడని అన్నారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచి దృష్టి మళ్లించే పని చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి నిర్దిష్టమైన విధి విధానాలను పాలకులు ప్రకటించడంలో ఘోరంగా విఫలమైనారని అన్నారు. ఉత్పాదక, అనుత్పాదక రంగాలలో ఉద్యోగ కల్పన లక్ష్యంగా, ధరల అదుపు ద్రవ్యోల్బణం అదుపు ఇలాంటి కీలకమైన అంశాలను విస్మరిస్తున్నారని అన్నారు.. ఉపాధి కల్పన ప్రజల కొనుగోలు శక్తి పెంపు లక్ష్యాలను పెట్టుకోకుండా మత విద్వేషాలను రెచ్చబడుతూ లౌకిక ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, జిల్లా నాయకులు పూనెం ప్రభాకర్ ముందంపల్లి వీరన్న బిల్లా కంటి సూర్యం డివిజన్ నాయకులు ఉమా గాని సత్యం జక్కుల యాకయ్య పైండ్ల యాకయ్య ఎండి మై పాషా తదితరులు పాల్గొన్నారు.


# టీఎన్‌జీవోఎస్ డైరీ ఆవిష్కరించిన కలెక్టర్



**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :** హనుమకొండ టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో సంఘం డైరీ ని కలెక్టర్ ప్రావిణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు హనుమకొండ జిల్లాను అభివృద్ధిలో మరియు సంక్షేమ పథకాలు అమలులో అగ్రభాగణ నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యక్రమానికి విచ్చేసిన మహిళా ఉద్యోగులు అందరికీ మార్చి 8 మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరం భాగస్వామ్యమై కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా అభివృద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ సిటీ క్యాలెండర్ మరియు పంచాయతీ కార్యదర్శుల క్యాలెండర్ లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘ నేతలు రాము నాయక్, మొయిజ్, లక్ష్మీప్రసాద్ ,హనుమకొండ సిటి యూనిట్ అధ్యక్షులు ప్రణయ్ కార్యదర్శి పృద్వి పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షులు అశోక్ కార్యదర్శి నరేష్ జిల్లా నేతలు రాజమౌళి, సురేష్, రాజేష్ ఖన్నా, రాజ్యలక్ష్మి, సింధూరాణి , పావని, శ్రీలత, గోపి కిషోర్, రమేష్, రాజీవ్, అనూప్,అశ్విని, శ్రీనివాస్, సుధాకర్, రజిత ,నిఖిల్, రఫీ, వెంకన్న , తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ను కలిసిన అజ్జు యాదవ్

**చిన్నకోడూరు, తెలంగాణ ముచ్చట్లు :**



రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్జు యాదవ్ మర్యాద పూర్వకంగా మంత్రి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా చిన్నకోడూరు మండల సమస్యలపై, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై,ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పార్టీ బలోపేతం కోసం గురించి మంత్రి తో చర్చించడం జరిగిందని తెలిపారు. మంత్రి ప్రతి అంశంపై సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# మిషన్ వాత్సల్య పథకానికి అర్హుల ఎంపికను పూర్తి చేయాలి

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**



మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మిషన్ వాత్సల్య పథకం అర్హుల ఎంపిక పై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మిషన్ వాత్సల్య పథకానికి జిల్లాలో ఎంతమంది ఎంపిక య్యారని, ఎన్ని దరఖాస్తులు ఇప్పటి వరకు వచ్చాయనే, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంపికకు సంబంధించిన విధివిధానాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి ఈ పథకానికి ఎంపిక చేయాలన్నారు. ఈ పథకానికి తల్లితండ్రులు లేని బాలబాలికలకు మొదటి ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి,బాల రక్షా భవన్ జిల్లా కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్చార్జి ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్, సిడబ్ల్యూసి మెంబర్ డాక్టర్ పరికి సుధాకర్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, శిశు గృహ ఇన్చార్జి మేనేజర్ ఏ మాధవి, సోషల్ వర్కర్లు ఎం శ్రీనివాసులు,జి సునీత,ఎస్ చైతన్య, ఓఆర్డబ్ల్యూపి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# సమానత్వంతోనే సమాజ పురోగతి





**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు**

ఎలాంటి అవాంతరాలు లేకుండా స్త్రీ, పురుష సమానత్వంతోనే సమాజం పురోగతిని సాధిస్తుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో యాక్సిలరేట్ యాక్షన్ అనే అంశం పై సమావేశాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గతంలో బాలబాలికల నిష్పత్తితో పాటు విద్యలోనూ వ్యత్యాసం ఉండేదని, కానీ అది నేడు తగ్గిపోతూ వస్తుందన్నారు. సమాజంలో వివిధ అవకాశాలను పొందేందుకు మహిళలకు సమాన హక్కులు రాజ్యాంగంలో కల్పించబడ్డాయన్నారు. మహిళలకు ఉన్నత విద్యను అభ్యసించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికలు విద్యా, ఉద్యోగ, ఇతర రంగాలలో సమాన అవకాశాలను సాధించాలన్నారు. స్త్రీ,పురుష సమానత్వం సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందన్నారు. మహిళా సాధికారతను సాధించాలని ఆకాంక్షించారు . విద్యా,ఉద్యోగం, ఇలా ఏ రంగంలోనైనా మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. విభిన్న రంగాలలో మహిళలు రాణిస్తున్నారని, ఎంచుకున్న లక్ష్యం కోసం కష్టపడాలన్నారు. ఎంచుకున్న లక్ష్యం కోసం కష్టపడి సాధించి నిరూపించుకోవాలన్నారు. స్త్రీ పురుషులు సమానం అనే భావన సమాజంలో నెలకోనాలన్నారు. ఈ సందర్భంగా ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ తెలియజేశారు. గౌరవ అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం మాట్లాడుతూ భిన్న రంగాలలో మహిళలు రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. సమాజంలో మహిళలు అనేక విధాలుగా హింసలను, అవమానాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నేటి అభివృద్ధి చెందిన సమాజంలోనూ అలాంటి పరిస్థితులు పోయి మహిళలకు సమున్నత స్థానం కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమాజంలోని బాలికలను, మహిళలను గౌరవించే విధంగా పెంచాలన్నారు. ఎలాంటి అంతరాలు లేకుండా బాలబాలికలను తల్లి దండ్రులు సమానంగా పెంచాలని అన్నారు. నేడు సమాజంలో బాలికలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, విదేశాల్లోనూ విద్య, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. విభిన్న రంగాలలో మహిళల మరింతగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ సమాజంలోని మహిళలను గౌరవించాలని అన్నారు. విభిన్న రంగాలలో మహిళలు రాణించినప్పుడే సమాజం ఎదుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ సమాజంలో బాలబాలికలకు సమాన గౌరవం ఉండాలన్నారు. బాల బాలికలను సమానంగా తల్లిదండ్రులు పెంచాలన్నారు. భావి జీవితం కోసం ఒక ప్రణాళికతో లక్ష్యం కోసం బాలికలు బాగా చదవాలన్నారు. బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా భవిష్యత్తు కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ కె.అనితా రెడ్డి మాట్లాడుతూ విభిన్న రంగాల్లో మహిళలు సాధికారతను సాధిస్తున్నారని అన్నారు. ఎంచుకున్న ఏ రంగంలోనైనా ముందుకెళ్లాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాన్ని మహిళలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, తదితరులను మహిళా అధ్యాపకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఉమెన్స్ సెల్ డైరెక్టర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీధర్ కుమార్ లోథ్, తిరునహరి శేషు, మహిళాఅధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు

**వాషింగ్టన్, తెలంగాణ ముచ్చట్లు :**



ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకంపనలు తీవ్రంగా ఉంటున్నాయి. కెనడా, మెక్సికో దేశాల ఉత్పత్తులపై 25 శాతం వరకు విధించిన సుంకాలు మంగళవారం నుంచి అమలు లోకి రాగా, ఆ దేశాలు కూడా అమెరికా ఉత్పత్తులపై 25 శాతం వరకు సుంకాలు విధించాయి. అవి మార్చి 10 నుంచి అమలు లోకి రానున్నాయి. ఇప్పటికే చైనా ఉత్పత్తులపై 10 శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా 20 శాతానికి పెంచడం తెలిసిందే. ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో బీజింగ్ విఫలమవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ ప్రకటించారు.చైనాపై సుంకాలు గత నెల నుంచే అమలు కాగా, తాజాగా వాటిని 20 శాతానికి పెంచడం గమనార్హం. దీనికి తగ్గట్టు చైనా కూడా అమెరికాకు గట్టి బదులిచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతోన్న వస్తువులపై 10 నుంచి 15 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. సోయాబీన్, పోర్క్, ఇతర ఉత్పత్తులపై 10 శాతం , చికెన్, మొక్కజొన్న, పత్తి వంటి ఉత్పత్తులపై 15 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించింది. మార్చి 10 నుంచి అవి అమలు లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. మరోవైపు కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకాల విషయంలో ఎలాంటి మార్పు లేదని ట్రంప్ వెల్లడించారు.మార్చి 4 (అమెరికా కాలమానం ప్రకారం ) నుంచి అవి యథావిధిగా అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా ట్రూడో కూడా అమెరికాపై సుంకాలు విధించారు.అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఆల్కహాల్, పండ్లు, సహా 107 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై తాము కూడా 25 శాతం సుంకం విధిస్తున్నట్టు వెల్లడించారు. ఇవి కూడా మంగళవారం నుంచే అమల్లోకి వస్తున్నట్టు తెలిపారు. ట్రంప్ సుంకాల దెబ్బకు అమెరికా మార్కెట్లు కుదేలయ్యాయి. ఆసియా పసిఫిక్,ఆస్ట్రేలియా మార్కెట్ల పైనా ఈ ప్రభావం పడింది.





## మహిళలు ఆరోగ్యపరంగా శ్రద్ధ వహించాలి

**హనుమకొండ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :**

మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం నాడు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రీడల పోటీలను హనుమకొండ కలెక్టరేట్లోని లాండ్లో మరియు టీజీవో భవన్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంబించారు. నిరంతరం కుటుంబ సభ్యుల క్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఉంటుందని,స్ట్రెస్ రిలీఫ్ కావడానికి పాటల పోటీలు నిర్వహించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిజీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు జిల్లా అధికారులు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు రాం రెడ్డి, కార్యదర్శి ఫణి కుమార్, సహా అధ్యక్షుడు అనురాధ, నీరజ, హనుమకొండ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, రాజేష్ కుమార్, మాధవి, శ్రీలక్ష్మి, శ్రీ ప్రియ, చేతన, హేమలత, కిరణ్మయి, హేమలత, తన్మయి, అరుణ, పవిత్ర, జయంతిలు హాజరయ్యారు.

## ఘనంగా సింగరేణి పాఠశాల 50వ వార్షికోత్సవ వేడుకలు



**మందమర్రి టౌన్ ,తెలంగాణ ముచ్చట్లు :**


మందమర్రి ఏరియాలో సింగరేణి కార్మికుల పిల్లలు, పరిసర ప్రాంతాల ప్రజల పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం సింగరేణి ఉన్నత పాఠశాలను 1975వ సంవత్సరంలో సిఎండి బి ఎన్ రామన్ ప్రారంభించారు. ఈ పాఠశాల ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 50వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యొక్క కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాసులు ముఖ్య అరిసెలుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల పిల్లలకు, పరిసర ప్రాంత ప్రజల పిల్లలకు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో సింగరేణి విద్యాలయాలను నిర్మించారని తెలిపారు, ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు దేశ ,విదేశాలలో ఉన్నత స్థాయి ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగి సింగరేణి కీర్తిని కండంతరాలు దాటించారని కొనియాడారు. విశాల స్థలంలో క్రీడా మైదానం, ఆహ్లాదమైన విద్యాలయం, విద్యార్థుల కోసం యూనిఫారం, పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నారని, కార్పొరేట్ స్థాయి విద్యలతో సమానంగా మన సింగరేణి పాఠశాలలో విద్యను అందిస్తు న్నారని తెలిపారు. నిర్బంధం లేని విద్యతోపాటు సైన్స్ ప్రయోగాలు, స్కౌట్ అండ్ గైడ్స్, కలల పట్ల అభిరుచి కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహక శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా సేవా అధ్యక్షురాలు సరూప రాణి, ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
బుధవారం 05- 03- 2025 General News www.telanganamuchatlu.in 7

# స్పిన్నర్లను ఎదుర్కోవడమే కీలకం..

**తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ న్యూస్ :**
ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాను ఫైనల్‌కు చేర్చే బాధ్యత ఇక బ్యాటర్లపైనే ఉంది. బౌలర్లు చక్కగా రాణించి ఆస్ట్రేలియా జట్టును 264 పరుగులకే కట్టడి చేశారు. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో పోల్చుకుంటే పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంది. ఆసీస్ బ్యాటర్లు సమన్వయంతో భాగస్వామ్యాలను నిర్మిస్తూ పరుగులు రాబట్టారు. అలాగే టీమిండియా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తే ఆసీస్ భారీ పరుగులు చేయకుండా కట్టడి చేశారు. స్టీవ్ స్మిత్ (73), అలెక్స్ క్యారీ (61) రాణించడంతో ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులు చేసింది. భారత్ ఎదుట 265 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (39) మెరుపు ఆరంభాన్ని అందించాడు. స్టీవ్ స్మిత్ స్పిన్‌ను తనదైన శైలిలో ఆడుతూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అద్భుతమైన టైమింగ్‌తో బౌండరీలు కొట్టాడు. ఇక, చివర్లో అలెక్స్ క్యారీ తన వంతు బాధ్యతను చక్కగా నిర్వర్తించాడు. మిడిలార్డర్‌లో లంబుషేన్ (29) కూడా రాణించాడు. అద్భుతమైన సిక్స్ కొట్టిన మ్యాక్స్‌వెల్ (7) తర్వాత బంతికే బౌల్డ్ అయ్యాడు. టీమిండియా బౌలర్లలో మహ్మద్ షమీ మూడ వికెట్లు తీశాడు. వరుణ్ చక్రవర్తి, జడేజా రెండేసి వికెట్లు పడగొట్టారు. అక్షర్, హార్దిక్ ఒక్కో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో గెలిచి ఫైనల్ చేరాలంటే టీమిండియా బ్యాటర్లు చెమటోడ్చాల్సిందే. ఈ పిచ్ మీద ఈ టోర్నీలో ఆస్ట్రేలియా సాధించిన ఈ 264 పరుగులే అధిక స్కోరు కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు కూడా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగింది. స్పిన్నర్లను టీమిండియా బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. ముఖ్యంగా రోహిత్, గిల్ మెరుపు ఆరంభంతో పాటు కోహ్లీ, అయ్యర్ రాణిస్తేనే ఈ మ్యాచ్‌లో గెలుపు సాధ్యమవుతుంది.






# స్టీవ్ స్మిత్ , మ్యాక్స్‌వెల్ ఔట్..

**తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ న్యూస్ :**
ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఔటయ్యాడు. భారత్‌తో జరుగుతున్న సెమీఫైనల్ మ్యాచ్‌లో 96 బంతుల్లో అతను 73 రన్స్ చేసి నిష్క్రమించాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు బౌండరీలు, ఓ సిక్సర్ ఉన్నాయి. భారత పేసర్ షమీ బౌలింగ్‌లో అతను క్లీన్ బౌల్డ్ అయ్యాడు. చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో ఇండియా కీలకమైన దశలో వికెట్‌ను తీసింది. చాలా సమయస్పూర్తితో ఆడిన స్మిత్.. ఓ భారీ షాట్ కొట్టేందుకు ముందుకు వచ్చి బౌల్డ్ అయ్యాడు.ఆ తర్వాత వచ్చీ రాగానే అక్షర్ బౌలింగ్‌లో సిక్సర్ కొట్టిన మ్యాక్స్‌వెల్.. .. ఆ తర్వాత బంతికే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తాజా సమాచారం ప్రకారం ఆస్ట్రేలియా 38 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 206 రన్స్ చేసింది. అలెక్స్ క్యారీ క్రీజ్‌లో ఉన్నాడు.

**స్మిత్, క్యారీ హాఫ్ సెంచరీలు..**
చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. బ్యాటర్లు స్టీవ్ స్మిత్, అలెక్స్ క్యారీలు హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఆ ఇద్దరూ భారత స్పిన్నర్లను మెరుగ్గా ఎదుర్కొన్నారు. స్లో బౌలర్లకు అనుకూలిస్తున్న దుబాయ్ పిచ్‌పై.. స్మిత్, క్యారీలు ఓపికగా ఆడారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు ఆరంభంలో జలక్ తగిలింది. ఓపెనర్ కూపర్ డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత ట్రావిస్ హెడ్ .. కొన్ని షాట్లతో అలరించాడు. షమీ వేసిన ఓ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్స్ కొట్టాడు. 39 రన్స్ చేసి ట్రావిస్ నిష్క్రమించాడు.అయితే క్రమంగా వికెట్లు కోల్పోతున్నా.. స్టీవ్ స్మిత్ మాత్రం సమర్థవంతంగా భారత స్పిన్నర్లను ఆడాడు. స్మిత్ 73 రన్స్ చేసి ఔటయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్ ఉన్నాయి. అలెక్స్ క్యారీ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతను మరో హాఫ్ సెంచరీ బాదాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లతో స్కోరు బోర్డును పరుగెత్తించే ప్రయత్నం చేశాడు. కానీ శ్రేయాస్ అయ్యర్ డైరెక్ట్ త్రో వల్ల అతను రనౌట్ అయ్యాడు.భారత బౌలర్లలో షమీ మూడు వికెట్లు తీసుకున్నాడు. స్పిన్నర్లు కూడా రాణించారు. వరుణ్, జడేజాలు చెరి రెండేసి వికెట్లు తీసుకున్నారు. ఇక అక్షర్, హార్దిక్ ఖాతాలో ఒక వికెట్ పడింది. దుబాయ్ పిచ్ స్లో ఉన్న కారణంగా.. ఆస్ట్రేలియా విసిరిన టార్గెట్ చాలా రసవత్తరంగా ఉంటుందని భావిస్తున్నారు. భారత బ్యాటింగ్ లైనప్ బలంగా ఉన్నా.. స్పిన్నర్లను ఎదుర్కొనే తీరును బట్టి ఫైనల్ ఆశలు నిలుస్తాయి.

# ఈ క్యాచ్ కరెక్టేనా..?




**తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ న్యూస్ :**
చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న సెమీఫైనల్‌లో టీమిండియా బౌలర్లు అదరగొడుతున్నారు. వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ కంగారూల జోరుకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తున్నారు. వేగంగా పరుగులు చేయకుండా నిరోధిస్తున్నారు. ఆరంభంలోనే వెటరన్ పేసర్ మహ్మద్ షమి వికెట్ తీసి భారత్‌కు సాలిడ్ స్టార్ట్ అందించాడు. కుర్ర బ్యాటర్ కొనొల్లీని ఔట్ చేసి భారత శిబిరంలో జోష్ నింపాడు. ఆ తర్వాత ప్రమాదకర ట్రావిస్ హెడ్ (39)ని వరుణ్ చక్రవర్తి పెవిలియన్‌కు పంపించాడు. అయితే హెడ్ క్యాచ్‌ను గిల్ అందుకున్న తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది కరెక్ట్ కాదు.. హెడ్ నాటౌట్ అంటూ కొందరు పిచ్చి పిచ్చి ఆర్గ్యుమెంట్స్ చేస్తున్నారు. మరి.. నిజం ఏంటో ఇప్పుడు చూద్దాం..హెడ్ స్ట్రయిట్ వికెట్ మీదుగా కొట్టిన బంతిని లాంగాఫ్‌లో ఉన్న గిల్ పరిగెత్తుకుంటూ వచ్చి చాకచక్యంగా అందుకున్నాడు.

దీంతో భారత ఆటగాళ్లు సంబురాల్లో మునిగిపోయారు. స్టేడియం మొత్తం ఒక్కసారిగా దద్దరిల్లింది. హెడ్ పెవిలియన్‌కు చేరడం, అతడి స్థానంలో మరో బ్యాటర్ వచ్చి మ్యాచ్ కంటిన్యూ అయింది. అయితే గిల్ క్యాచ్ అందుకున్నాక ఒక్క సెకన్ కూడా బాల్‌ను చేతిలో హోల్డ్ చేయలేదు. దీంతో పట్టిన వెంటనే అలా పడేస్తే నాటౌట్ అంటూ చర్చకు దారితీసింది. కొద్దిసేపటికే అంపైర్ కూడా గిల్‌ను పిలిచి అలా పడేయొద్దు.. బాల్ మీద నియంత్రణ రావాలి, అందుకొని కొద్ది సేపయ్యాకే వదలాలంటూ వార్నింగ్ ఇస్తున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అయితే దీనిపై రూల్స్ ఏం చెబుతున్నాయి? అసలు క్యాచ్ పట్టాక బాల్‌ను పడేస్తే ఔటా? బంతిని ఎంత సేపు హోల్డ్ చేయాలి? అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. క్యాచ్ అందుకున్నాక బంతిని ఫలానా సమయం పట్టుకొని ఉండాలని క్రికెట్‌లో రూల్ ఏమీ లేదు. ఇంత సేపు పట్టుకోవాలనే టైమ్ లిమిట్ లేదు. కానీ క్యాచ్ పట్టాక బాల్‌ను పర్ఫెక్ట్‌గా హోల్డ్ చేయాలి. దాని మీద పూర్తి నియంత్రణ ఉన్నట్లు కనిపించాలి. అదే సమయంలో బంతి నేలను తాకకుండా చూసుకోవాలి. అలాగే అది చేతుల్లో బౌన్స్ అవ్వకుండా చూసుకోవాలి. ఒకవేళ చేతుల్లో బౌన్స్ అయితే మళ్లీ దాన్ని పట్టుకొని కంట్రోల్‌లోకి తెచ్చుకోవాలి. ఆ తర్వాత కింద పడేసి సెలబ్రేషన్ చేసుకున్నా ఏమీ కాదు. బంతిని అందుకున్నాక తడబడ ినట్లు అనిపిస్తే ఔట్ ఇవ్వరు. తడబడినట్లు చేసి కవర్ చేసేందుకు సెలబ్రేషన్ చేసుకున్నా బంతి చేజారినట్లుగానే భావించి నాటౌట్‌గా ప్రకటిస్తారు. అందుకే గిల్‌ను పిలిచి ఈ విషయం గురించి క్లారిటీగా చెప్పాడు అంపైర్. కాబట్టి ఈ కాంట్రవర్సీలో ఆయన తప్పేం లేదని నెటిజన్స్ అంటున్నారు

# చేజింగ్‌లో అత్యధిక రన్స్ చేసిన ఆటగాళ్లు వీళ్లే..

**తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ న్యూస్ :**




వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌లలో ఛేజింగ్‌లో అత్యధిక రన్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో టాప్–3 లో ముగ్గురూ భారతీయులే ఉన్నారు. ఈ జాబితాలో 8,720 పరుగులతో అగ్రస్థానంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కొనసాగుతున్నాడు. రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ఆ తర్వాత స్థానంలో ఉన్నాడు. కోహ్లీ ఛేజింగ్‌లో 8000 పరుగుల మైలురాయిని దాటాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 8 వేల పరుగుల మైలురాయిని దాటాడు. కోహ్లీ తర్వాత 6,115 పరుగులతో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ఆ తర్వాత స్థానాల్లో శ్రీలంక స్టార్ బ్యాటర్ సనత్ జయసూర్య (5,742 పరుగులు), దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ (5,575 పరుగులు) ఉన్నారు.

# ఒక్క వికెట్.. దద్దరిల్లిన స్టేడియం..

**తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ న్యూస్ :**
సాధారణంగా మనుషులు వినగలిగే సౌండ్ 85 డెసిబల్స్. ఈ రేంజ్ కంటే ఎక్కువ శబ్దం వింటే చెవికి ప్రమాదం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తుంటారు. 110 డెసిబల్స్‌కు మించిన సౌండ్ వింటే చెవి దెబ్బ తింటుందని వార్నింగ్ ఇస్తుంటారు. అలాంటిది ఒకేసారి 123 డెసిబల్స్ శబ్దం వింటే పరిస్థితి ఊహించుకోవచ్చు. చాంపియన్స్ ట్రోఫీ–2025లో భాగంగా భారత్–ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇది చోటుచేసుకుంది. కంగారూ ఓపెనర్, డేంజర్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ ఔటైన సమయంలో స్టేడియం మొత్తం ఒక్కసారిగా దద్దరిల్లింది. హెడ్ ఫుల్ ఫామ్‌లో ఉండటం, వరుసగా ఫోర్లు, సిక్సులతో విరుచుకుపడటంతో దుబాయ్ స్టేడియం నిశ్శబ్దంగా మారింది. భారత అభిమానులు సైలెంట్ అయిపోయారు. వన్డే ప్రపంచ కప్–2023 ఫైనల్ రిపీట్ అవుతోందని, రోహిత్ సేన పనైపోయిందని బాధపడసాగారు. కానీ ఒక్క బంతితో అంతా మారిపోయింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వచ్చీ రాగానే చక్కటి బంతితో హెడ్‌ను బోల్తా కొట్టించాడు. అతడి బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి గిల్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు హెడ్. దీంతో భారత అభిమానులు సంబురాల్లో మునిగిపోయారు.



ఔట్.. మీ ఖేల్ ఖతం అంటూ ఆసీస్‌ను ఉద్దేశించి అరవసాగారు. ఈలలు, కేకలతో రచ్చ రచ్చ చేశారు. ఈ టైమ్‌లో సౌండ్ మీటర్‌లో శబ్దం 123 డెసిబల్స్‌గా నమోదైంది.

# సినిమా చేస్తే మినిమం రూ.500 కోట్లు..?





**తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్ :**
ఇప్పుడు ఇండస్ట్రీలో కొంత మంది భామలు దర్శక నిర్మాతలకి లక్కీగా మారారు. వాళ్లతో సినిమా చేస్తే హిట్ పక్కా అనే భావనలో ఉన్నారు. అలాంటి వారిలో రష్మిక మంధాన ఒకరు. ఈ అమ్మడు గత కొద్ది కాలంగా వరుస హిట్స్ తో దూసుకుపోతుంది. ఈమె సెట్‌లో అడుగుపెడితే ఆ మూవీకి రూ.500 కోట్ల కలెక్షన్స్, చిందులేస్తే వెయ్యి కోట్లు అన్నట్టుగా ఉంది. సక్సెస్‌కి చిరునామాగా మారిన ఈ భామ కోసం ఇప్పుడు నిర్మాతలు క్యూ కడుతున్నారు. వరుస బ్లాక్ బస్టర్ సినిమాలతో ఫుల్ హ్యాపీగా ఉన్న రష్మికా ఇప్పుడు సల్మాన్ ఖాన్ తో కలిసి సికందర్ మూవీలో బిజీగా ఉంది. ఈ చిత్రంతో పాటు మరి కొన్ని సినిమాలు కూడా ఈమె ఖాతాలో ఉన్నాయి.రష్మిక ఇటీవల ఛావా అనే సినిమాతో పెద్ద విజయాన్ని అందుకుంది. ఈ సినిమా రూ.500 కోట్లకి పైగా వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు తెలుగులో కూడా ఈ మూవీ విడుదల అవుతుండడంతో చిత్రానికి మరింత కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉంది. ఇక కొద్ది రోజుల క్రితం రష్మిక నటించిన పుష్ప కలెక్షన్స్ విషయంలో రికార్డ్స్ క్రియేట్ చేసింది. అయితే పుష్పలో రష్మిక రోల్ పెద్దగా లేకపోయిన కూడా పుష్ప2లో మాత్రం చిత్ర కథ అంతా ఈ అమ్మడి చుట్టూనే తిరుగుతూ ఉండడంతో ఆమెకి మంచి పేరు వచ్చింది. పుష్ప 2 సినిమాలో రష్మిక పర్ఫార్మెన్స్‌కి ప్రతి ఒక్కరు మంత్ర ముగ్ధులు అయ్యారు. బాలీవుడ్ లో రష్మిక నటించిన యానిమల్ సినిమా 900 కోట్ల వరకూ కలెక్ట్ చేసింది. ఇక పుష్ప 2 సినిమా దాదాపు 1900 కోట్ల కొల్లగొట్టింది. ఇక తాజాగా ఛావా చిత్రం 500 కోట్లు రాబట్టగా, ఈ మూవీ ఇంకా వసూళ్లు రాబడుతూనే ఉంది. మొత్తానికి మూడు సినిమాలు భారీ కలెక్షన్లు సాధించి రికార్డులు క్రియేట్ చేశాయి. వరుస సక్సెస్‌లతో ఫుల్ జోష్‌లో ఉన్న రష్మిక మందన్నా మధ్య మధ్యలో టూర్స్ కూడా వేస్తూ ఉంటుంది. ఫ్యామిలీతో ఫుల్‌గా ఎంజాయ్ చేస్తుంటుంది. అలానే అప్పుడప్పుడు విజయ్ దేవరకొండతో తళుక్కున మెరుస్తూ ఉంటుంది. ఇద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందనే ప్రచారం ఉంది. దీనిపై మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. కాగా, రష్మిక ఇప్పటి వరకు రూ.10 కోట్లు రెమ్యునరేషన్ తీసుకోగా, ఆమె తన రెమ్యునరేషన్‌ని రూ.20 కోట్లకి కూడా పెంచే అవకాశం ఉంది.



## కల్యాణ్‌రామ్ కోసం ఆ టైటిల్..

**తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్ :**
నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. విజయశాంతి కీలక పాత్రలో కనిపిస్తారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ విలన్ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమాకు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఇందులో విజయశాంతి పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారని సమాచారం. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత ఆమె మహేశ్ నటించిన సరిలేరు నీకెవ్వరూ' సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు. తదుపరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో కీలక పాత్ర చేయడానికి అంగీకరించారు. ముప్పా వెంకయ్య చౌదరి, సునీల్ బలుసు, అశోక్ వర్దన్, కల్యాణ్ రామ్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు అందిస్తున్నారు.



## ఒక్క పోస్ట్‌తో ఫుల్ ట్రెండింగ్.!

**తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్ :**
మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ పెట్టిన ఒక పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. అతడు పెట్టిన పోస్ట్ ఎస్ఎస్ఎంబీ29 గురించే అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజ మౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తు న్నారు. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఈ సినిమా వస్తుండటంతో పాటు మహేశ్, రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచ నాలు ఏర్పడ్డాయి. ఇక ఈ సినిమాలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుం డగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్ర ం. అయితే ఈ చిత్రంలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటించబోతున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. అందుకు కారణం. పృథ్వీరాజ్ తాజాగా పెట్టిన ఒక పోస్ట్.

# ఇండస్ట్రీలో మరో బ్రేకప్పా..!





**తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్ :**
సినీ సెలబ్రిటీల ప్రేమ, పెళ్లి, బ్రేకప్‌ల వ్యవహారాలు ఎప్పుడు వార్తలలో నిలుస్తుంటాయి. వారు ఎప్పుడు ప్రేమలో పడతారో, ఎప్పుడు పెళ్లి చేసుకుంటారో, ఎప్పుడు బ్రేకప్ చెప్పుకుంటారో చెప్పడం చాలా కష్టం. ఇటీవలి కాలంలో ఘాడంగా ప్రేమించుకున్న చాలా సెలబ్రిటీ జంటలు ఊహించని విధంగా విడాకులు తీసుకొని అందరికి షాకులు ఇచ్చారు. అయితే త్వరలో పెళ్లి బంధంతో తమన్నా- విజయ్ వర్మ ఒక్కటి కాబోతారని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమయంలో వారిద్దరి బ్రేకప్ కి సంబంధించిన వార్తలు అభిమానులని ఆందోళనకి గురి చేస్తున్నాయి.విజయ్ వర్మతో తమ బంధాన్ని గుట్టుగా ఉంచిన తమన్నా ఆ తర్వాత ఓపెన్ అయింది. కలిసి ఈవెంట్స్‌లో దర్శనం ఇవ్వడం, మీడియా ముందు ఫొటోలకి పోజులివ్వడం వంటివి చేస్తూ వచ్చారు. అయితే గత కొంత కాలంగా వీరిద్దరు కలిసి కనిపించడం లేదని, విడిపోవాలని నిర్ణయించుకున్నారని ఇన్‌సైడ్ టాక్. తమన్నా ఒంటరిగా కలిసి కనిపిస్తున్న నేపథ్యంలో తమన్నా-విజయ్ వర్మ లవ్‌కి బ్రేకప్ పడిందని బాలీవుడ్ మీడియా జోరుగా ప్రచారం చేస్తుంది. మరి దీనిపై తమన్నా కాని లేదంటే విజయ్ కాని స్పందిస్తుందా అనేది చూడాలి. ఇంకొంత కాలం తమన్నా, విజయ్ వర్మలు కనుక వేడుకలు, ఇతరత్రా చోట్ల కలిసి కనిపించకపోతే అందరు కూడా వారిద్దరి రిలేషన్ బ్రేకప్ అయిందని డిసైడ్ అయిపోతారు. ఈ లోపే ఎవరైన స్పందిస్తే బాగుంటుంది. ఇక ఇదిలా ఉంటే తమన్నా గతంలో మాదిరిగా సినిమాలు చేయకపోయిన అడపాదడపా మాత్రం కొన్ని సినిమాలలో మెరుస్తూ రచ్చ చేస్తుంది. మహిళా అఘోరాగా తమన్నా తొలిసారిగా నటించిన ఓదెల 2 ఇటీవలే కుంభమేళాలో టీజర్ లాంచ్ జరుపుకుంది. సంపత్ నంది రచన, నేతృత్వంలో నిర్మించిన ఈ హారర్ థ్రిల్లర్ చిత్రం తమన్నాకి మంచి బ్రేకప్ అవుతుందని భావిస్తుంది.తమిళ, తెలుగు, హిందీ భాషల్లో నటించిన తమన్నా మంచి క్రేజ్ అందుకుంది. తెలుగు స్టార్ హీరోల అందరితోనూ నటించి మంచి గుర్తింపు కూడా తెచ్చుకుంది. తమన్నా ప్రస్తుతం సినిమాల కన్నా వెబ్ సరీస్‌ల్లోనే ఎక్కువుగా నటిస్తూ ప్రేక్షకులని అలరిస్తుంది. తన తోటి హీరోయిన్స్ కాజల్, నయనతార, రకుల్, సమంత వంటి వారంతా పెళ్లి చేసుకోగా తమన్నా మాత్రం బ్యాచిలర్‌గానే ఉంది.

# ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నా

**తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్ :**
నెట్‌ఫ్లిక్స్ నుంచి వచ్చిన సాక్రేడ్ గేమ్స్ వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి కుబ్రా సైత్ తన వ్యక్తిగత జీవితంలో జరిగిన సంచలన విషయం గురించి మీడియాతో తాజాగా పంచుకుంది. తాను అండమాన్ ట్రిప్‌లో ఉన్నప్పుడు ఒక స్నేహితుడితో కలవడం వలన గర్భం దాల్చానని.. దీంతో ఒక్కసారిగా ఏం చేయాలో తోచలేదని అందుకే వెంటనే ఎవరికీ చెప్పకుండా.. ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నాను అంటూ నటి చెప్పుకోచ్చింది.అబార్షన్ చేయించుకోవడానికి వెళ్లినప్పుడు నేను చాలా బలహీనంగా ఉన్నాను. అప్పుడే అర్థం అయ్యింది. దీనిని నేను మోయలేను అని.. ఒకవేళ నేను అబార్షన్ చేయంచుకోపోతే బిడ్డతో జీవిస్తానని చెప్పే ధైర్యం కూడా నాకు లేదనిపించింది. అందుకే ఎవరికీ చెప్పకుండా ఒంటరిగా వెళ్లి అబార్షన్ చేయించుకున్నా. అబార్షన్ అనంతరం నేను చాలా రీలిఫ్ అయ్యాను. ఎదో బరువు దిగినట్లు అనిపించింది. అయితే అబార్షన్ తర్వాత ఈ విషయాన్ని చాలా ఏండ్ల వరకు



ఎవరితో పంచుకోలేదని తెలిపింది. ఇక ఈ విషయాలన్నింటిన తన బయోగ్రఫీ అయిన ఓపెన్ బుక్: నాట్ క్వైట్ ఎ మెమోయిర్" (2022) అనే పుస్తకంలో ప్రస్తవించింది కుబ్రా సైత్ సినిమా విషయాలకు వస్తే.. సాక్రేడ్ గేమ్స్ తర్వాత మళ్లీ కనిపించలేదు ఈ నటి. అయితే తాజాగా బాలీవుడ్ నుంచి వస్తున్న రామాయణ్‌లో ఈ భామ రావణుడి చెల్లి శూర్పణఖ పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా దీనిపై చిత్రబృందం ప్రకటించాల్సి ఉంది.

## ఓ సారి షూటింగ్ స్పాట్‌లో
# ఏమైందంటే..!



**తెలంగాణ ముచ్చట్లు, సినిమా న్యూస్ :**
పాత హీరోయిన్స్ గురించి ఇప్పటి తరం వారికి పెద్దగా తెలియకపోవచ్చు. అయితే ఆ కాలంలో అందాల ముద్దుగుమ్మలు చాలా మందే ఉన్నారు. వారిలో ఒకరు లైలా. గోవాలో పుట్టి పెరిగిన ఈ అందాల ముద్దుగుమ్మ.. 'దుష్మన్ దునియా కా' అనే బాలీవుడ్ సినిమాతో తెరంగేట్రం చేసింది. ఈ సినిమా తర్వాత మలయాళంలో 'ఇద ఒరు స్నేహకాద' అనే సినిమా చేసింది. ఆ తర్వాత విజయకాంత్ నటించిన 'కళళగర్' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో వరుస అవకాశాలు అందుకుంది ఈ అందాల ముద్దుగుమ్మ.లైలా తెలుగులో 'ఎగిరే పావురమా', 'పెళ్లి చేసుకుందాం', 'ఉగాది', 'ఖైదీ గారు', 'పవిత్ర ప్రేమ', 'లవ్ స్టోరీ 1999', 'శుభలేఖలు', 'నా హృదయంలో నిదురించే చెలి' వంటి చిత్రాలు చేసి ఇక్కడి ప్రేక్షకుల మనసులు దోచుకుంది. ఇక తరుణ్ నటించిన నువ్వే కావాలి చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్‌తో దుమ్ము రేపింది. అయితే 2006లో ఒక మలయాళ సినిమాలో నటించిన లైలా, విదేశీ వ్యాపారవేత్తను ప్రేమించి పెళ్లి చేసుకుని ఇక సినిమాల నుండి తప్పుకుంది. ఇక వీరి సంసార జీవితంలో ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. 90ల అభిమానుల కలల రాకుమారిగా వెలుగొందిన లైలా.. ఇటీవల తనకున్న వింత వ్యాధి గురించి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. లైలా అసలు ప్రాబ్లమ్ ఏంటంటే.. ఆమె ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుందట. ఈమెకి ఉన్న వింత సమస్యని గుర్తించిన హీరో విక్రమ్.. శివపుత్రుడు షూటింగ్ స్పాట్‌లో ఒక్క నిమిషం కూడా నవ్వకుండా ఉండాలని లైలాకు ఛాలెంజ్ విసరగా, ఆమె 30 సెకన్లలో ఏడ్చేసిందట. దాంతో లైలా వేసుకున్న మేకప్ అంతా కరిగిపోయిందని చెప్పుకొచ్చింది. లైలా నవ్వుతూ ఉంటేనే బాగుంటుంది. ఆమె కనుక నవ్వు ఆపేస్తే వెంటనే తన కంటి నుండి కన్నీళ్లు వచ్చేస్తాయట. తనకి తెలియకుండానే అలా కంటి నుండి కన్నీళ్లు వచ్చేస్తాయని, లైలా ఇప్పటికీ అలాంటి వింత వ్యాధితో బాధపడుతున్నట్టుగా తెలుస్తుంది. పాపం లైలాకి ఉన్న ఈ విచిత్రమైన వ్యాధి గురించి తెలుసుకున్న ఆమె అభిమానులు కాస్త ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor:BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telangana-muchatlu.in